క్లుప్తంగా

నేటి నుంచి ధనుర్మాసోత్సవాలు

గరుగుబిల్లి: మండలంలోని తోటపల్లి శ్రీవేంకటేశ్వరస్వామి ఆలయంలో సోమవారం నుంచి ధనుర్మాసోత్సవాలు నిర్వహిస్తున్నట్లు అర్చకులు అప్పలాచార్యులు ఆదివారం తెలిపారు. 2025 జనవరి 14వ తేదీ వరకు నెల రోజుల పాటు తిరుప్పావై పాశురాలు పఠిస్తారు. దీంతో పాటు విష్ణుమూర్తిని మధుసూదనుడిగా పూజిస్తారు. అలాగే ప్రతీ శుక్రవారం గోదాదేవికి పూజలు చేస్తారు. ఈ మాసంలో పాశురాలు పఠించినా, విన్నా, గోదాదేవి కల్యాణం తిలకించినా సకల శుభాలు కలుగుతాయని భక్తుల ప్రగాఢ విశ్వాసం.

ఎట్టకేలకు రహదారి పనులు


రహదారి పనులు చేపడుతున్న కార్మికులు

సీతంపేట: మండలంలోని కుమ్మరిగండి గ్రామానికి సీసీ రోడ్డు వేసేందుకు వైఎస్సార్‌ సీపీ హయాంలో నిధులు మంజూరయ్యాయి. అప్పట్లో కొన్ని కారణాల వల్ల పనులు చేపట్టలేకపోయారు. ప్రస్తుతం ఆ నిధులతో సీసీ రోడ్డు పనులు చేపడుతున్నారు. దీంతో ఆయా ప్రాంతాల ప్రజలకు రహదారి కష్టాలు తీరనున్నాయి.

విగ్రహావిష్కరణ


విగ్రహం వద్ద నివాళులర్పిస్తున్న నంగిరెడ్డి సోదరులు

కొమరాడ: మండలంలోని రాజ్యలక్ష్మీపురం గ్రామంలో మాజీ ఎంపీపీ నంగిరెడ్డి అప్పలస్వామినాయుడు విగ్రహాన్ని కుటుంబ సభ్యులు ఆదివారం ఆవిష్కరించారు. అప్పలస్వామినాయుడు మనవడు, వైస్‌ ఎంపీపీ నంగిరెడ్డి శరత్‌బాబు.. ఆయన విగ్రహానికి పూలమాలలు వేసి, నివాళులర్పించారు. అనంతరం ఆయన ఎంపీపీగా అందించిన సేవలను కొనియాడారు. కార్యక్రమంలో నంగిరెడ్డి శ్రావణ్‌కుమార్‌ తదితరులు పాల్గొన్నారు.

భక్తిశ్రద్ధలతో సుదర్శన హోమం


హోమం చేస్తున్న భక్తులు

గరుగుబిల్లి: దత్త జయంతి పురస్కరించుకుని, స్థానిక షిర్డీసాయిబాబా ఆలయంలో జైగురు దత్త హోమం, సుదర్శన హోమం ఆదివారం భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. ఉదయం సుప్రభాతసేవ, కాగడహారతి, పాలాభిషేకం తదితర పూజలు చేపట్టారు. పూజా కార్యక్రమాల అనంతరం తిరువీధి మహోత్సవం చేపట్టారు. మధ్యాహ్నం భక్తులకు అన్నదానం చేశారు.

పెరిగిన చలి


పట్టణంలోని కొత్తవీధిని కమ్ముకున్న పొగ మంచు

పాలకొండ రూరల్‌: పాలకొండ నియోజకవర్గంలో మూడు రోజులుగా చలి తీవ్రత ఘననీయంగా పెరిగింది. ఆదివారం తెల్లవారుజామున పొగమంచు కురవడంతో అన్నివర్గాల ప్రజలు ఇబ్బంది పడ్డారు. ఏజెన్సీ సీతంపేట కలబోసి ఉన్న ఈ ప్రాంతంలో మంచు ప్రభావం అధికంగా ఉండడంతో మామిడి, జీడి, అపరాల పంటలు పండిస్తున్న రైతులు అప్రమత్తంగా ఉండాలని సంబంధిత శాఖాధికారులు సూచిస్తున్నారు. చలి ప్రభావంతో వృద్ధులు, బాలింతలు, గర్భిణులు, చంటి పిల్లల విషయంలో జాగ్రత్తలు తప్పనిసరని చిన్నపిల్లల వైద్యనిపుణుడు జె.రవేంద్రకుమార్‌ తెలిపారు. ఈ సీజన్‌లో శ్వాస సంబంధిత, సైన్‌ఫ్లూ వంటి వ్యాధులు ప్రబలే అవకాశం ఉన్నందున చిన్నపాటి ఆరోగ్య సమస్య తలెత్తినా తక్షణమే వైద్యులను సంప్రదించాలన్నారు.

ఘంటసాల కారణజన్ముడు

సాలూరు: సినీ సంగీత నేపథ్య గాయకుడు దివంగత ఘంటసాల కారణ జన్ముడని స్త్రీ,శిశుసంక్షేమ,గిరిజన సంక్షేమశాఖామంత్రి గుమ్మడి సంధ్యారాణి అన్నారు. ఈ మేరకు సాలూరు పట్టణంలోని ఎన్‌జీఓ రిక్రియేషన్‌ క్లబ్‌లో జరుగుతున్న ఘంటసాల ఆరాధనోత్సవాల కార్యక్రమంలో ఆదివారం ఆమె ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. ఘంటసాల సంగీత సామ్రాజ్యానికి చేసిన కృషిని ఎవరూ మరిచిపోలేరని కొనియాడారు. ఘంటసాల విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. ఆరాధనోత్సవాల్లో పలువురు గాయకులు పాడిన ఘంటసాల పాటలు శ్రోతలను ఆకట్టుకున్నాయి. కార్యక్రమంలో పలువురు నాయకులు, ఘంటసాల అభిమానులు పాల్గొన్నారు.

పీఠంపై కూర్చునేదెవరో..?

- తోటపల్లి ప్రాజెక్ట్‌ ఛైర్మన్‌ పదవికి గట్టి పోటీ
- 17న డిస్ట్రిబ్యూటరీ కమిటీ ఎన్నికలు
- 20న తోటపల్లి ప్రాజెక్ట్‌ ఛైర్మన్‌ ఎన్నిక

వీరఘట్టం:

జిల్లాలో 213 నీటి సంఘాలుండగా.. అందులో తోటపల్లి ప్రాజెక్ట్‌ కమిటీ ఛైర్మన్‌ కుర్చీ కోసం మాత్రం తీవ్ర పోటీ నెలకొంది. తోటపల్లి ప్రాజెక్ట్‌ కమిటీ ఛైర్మన్‌ పదవి వరిస్తే ప్రత్యేక హోదా వచ్చినట్లే. అందుకే ఆ పదవి కోసం నాయకులు తీవ్రంగా శ్రమిస్తారు. విషయంలోకి వెళ్తే.. ఈ నెల 14న జరిగిన నీటి వినియోగదారుల సంఘ ఎన్నికల్లో అధ్యక్షులుగా కూటమి నాయకులు ఎంపికయ్యారు. ప్రాజెక్ట్‌ కమిటీ ఛైర్మన్‌ కావాల్సిన వారు ముందుగా ఈ నెల 17న జరగనున్న డిస్ట్రిబ్యూటరీ కమిటీ అధ్యక్షుడిగా ఎంపికవ్వాలి. డిస్ట్రిబ్యూటరీ కమిటీ సభ్యుల్లో ఒకరిని తోటపల్లి ప్రాజెక్ట్‌ కమిటీ ఛైర్మన్‌గా ఎన్నుకోవడం ఆనవాయితీ. అయితే తోటపల్లి ప్రాజెక్ట్‌ పరిధిలో ఉన్న వీరఘట్టం, తూడి, ఎం.సింగుపురం, రాజులగుమ్మడ, రావివలస డిస్ట్రిబ్యూటరీలు వీరఘట్టం, పాలకొండ, వంగర, గరుగుబిల్లి మండలాల్లో ఉన్నాయి. వీటిలో నాలుగు డిస్ట్రిబ్యూటరీలకు వీరఘట్టం, పాలకొండకు చెందిన వారే ఎక్కువగా ఉన్నారు. పైగా వీరంతా పాలకొండ ఎమ్మెల్యే నిమ్మక జయకృష్ణ అనుచరులు కావడంతో ఈ ప్రాంతానికి చెందిన వారికే తోటపల్లి ప్రాజెక్ట్‌ కమిటీ ఛైర్మన్‌ పదవి దక్కుతుందనే ఊహాగానాలు వినిపిస్తున్నాయి. ఇదిలా ఉంటే వీరిలో రాజకీయ కుటుంబ నేపథ్యంలో ఉన్న ఏఎంసీ మాజీ ఛైర్మన్‌ పొదిలాపు కృష్ణమూర్తినాయుడు భార్య విజయరమణి ప్రస్తుతం కంబర నీటి సంఘ అధ్యక్షురాలిగా ఎంపికయ్యారు. కంబర నీటి సంఘం వీరఘట్టం డిస్ట్రిబ్యూటరీలో ఉండడంతో, ఇక్కడ పోటీ ఉన్నప్పటికీ విజయరమణికే డిస్ట్రిబ్యూటరీ ఇచ్చే అవకాశాలు ఉన్నాయని.. ఇదే జరిగితే ఈమెకే తోటపల్లి ప్రాజెక్ట్‌ కమిటీ ఛైర్‌పర్సన్‌ పదవి దక్కే అవకాశం ఉంది.

అచ్చెన్న సహకారం ఎవరికో..

తోటపల్లి ప్రాజెక్ట్‌ కమిటి ఛైర్మన్‌ పదవి ఏకగ్రీవం అవుతుందని అంతా అంటున్నప్పటికీ.. రాజులగుమ్మడ డీసీలో ఓ వ్యక్తి పోటీలో ఉన్నట్లు సమాచారం. ఆ పదవి కోసం అతను తీవ్రంగా శ్రమిస్తున్నాడని వినిపిస్తోంది. ప్రస్తుతం తోటపల్లి పంచాయితీ జిల్లా ఇన్‌చార్జ్‌ మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు టేబుల్‌పై ఉందని కూటమి నాయకులు చెబుతున్నారు. ఎమ్మెల్యే జయకృష్ణకు ఇన్‌చార్జ్‌ మంత్రి అచ్చెన్నాయుడుకు ఎప్పటి నుండో అంతర్గత కలహాలు ఉన్నాయని బాహాటంగానే చర్చించుకుంటున్నారు. గత సార్వత్రిక ఎన్నికల ముందు పాలకొండ టీడీపీ నియోజకవర్గ ఇన్‌చార్జ్‌గా ఉన్న జయకృష్ణకు టీడీపీ టికెట్‌ రాకుండా అచ్చెన్నాయుడు అడ్డుకున్నారనే ప్రచారం కూడా అప్పటిలో జరిగింది. దీంతో జయకృష్ణ టీడీపీని వీడి జనసేనలో చేరి పాలకొండ ఎమ్మెల్యేగా గెలిచారు. అయితే ఆ వైరం ఇంకా కొనసాగుతునే ఉందని చెప్పవచ్చును. ఎందుకంటే ఇటీవల జిల్లా ఇన్‌చార్జ్‌ మంత్రిగా అచ్చెన్నాయుడును నియమించడంతో.. అతన్ని ఆ బాధ్యతల నుంచి తప్పించాలని ఎమ్మెల్యే జయకృష్ణతో పాటు జిల్లా ఎమ్మెల్యేలు ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడుకు ఫిర్యాదు చేశారు. అయితే వీరి ఫిర్యాదును సీఎం చంద్రబాబు తోసిపుచ్చారు. ఈ పరిస్థితుల్లో అచ్చెన్నాయుడు ఎవరికి బొట్టు పెడితే వారే తోటపల్లి ప్రాజెక్ట్‌ కమిటి ఛైర్మన్‌ పదవి అలంకరిస్తారని కూటమి నాయకులు చర్చించుకుంటున్నారు. మరి ఈ నెల 20న జరగనున్న తోటపల్లి ప్రాజెక్టు ఛైర్మన్‌ పదవి ఎవరిని వరిస్తుందో వేచి చూద్దాం.


తోటపల్లి జలాశయం

ఇదీ పరిస్థితి..

తోటపల్లి ప్రాజెక్ట్‌ పరిధిలోని 64 వేల ఎకరాల పాత ఆయకట్టులో గరుగుబిల్లి, వంగర, జియ్యమ్మవలస, వీరఘట్టం, పాలకొండ మండలాలు ఉన్నాయి. ఈ మండలాల్లో 42 వేల మంది రైతులకు సంబంధించి 25 నీటి వినియోగదారుల సంఘాలు ఉన్నాయి. వీటిని వీరఘట్టం, తూడి, ఎం.సింగుపురం, రాజులగుమ్మడ, రావివలస ఐదు డిస్ట్రిబ్యూటరీలుగా విభజించారు.

డిస్ట్రిబ్యూటరీలు	ఇందులో ఉన్న నీటి సంఘాలు
వీరఘట్టం	వీరఘట్టం, కంబర, నడుకూరు, చిదిమి, అవలంగి,
తూడి	తూడి, నవగాం, తుమరాడ, తెట్టంగి, వండువ
ఎం.సింగుపురం	ఎం.సింగుపురం, పాలకొండ, ఎన్‌.కే.రాజపురం, బాసూరు, గుడివాడ
రాజులగుమ్మడ	రాజులగుమ్మడ, కొత్తూరు, కొత్తపల్లి, శివ్వాం, తలగాం
రావివలస	రావివలస, కొట్టుగుమ్మడ, నడిమికెల్ల, విక్రమపురం, పెద్దబుడ్డిడి

నిబంధనలు తప్పనిసరి..

- ఎస్సై ప్రయోగమూర్తి

పాలకొండ రూరల్‌: వాహనచోదకులు ట్రాఫిక్‌ నిబంధనలు తప్పనిసరిగా పాటించాలని ఎస్సై కె.ప్రయోగమూర్తి అన్నారు. పాలకొండ – విశాఖ, సీతంపేట రహదారుల్లో ఆదివారం వాహనతనిఖీలు చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, ద్విచక్ర వాహనదారులు తప్పకుండా హెల్మెట్‌ ధరించాలని సూచించారు. కార్లు నడిపేవారు తప్పకుండా సీట్‌బెల్ట్‌ పెట్టుకోవాలన్నారు. మైనర్లకు వాహనాలు ఇస్తే వాహన యజమానిపై కేసులు తప్పవని స్పష్టం చేశారు. ప్రస్తుత శీతాకాలంలో వేకువజామున, రాత్రి సమయంలో మంచు అధికంగా ఉండడం వల్ల వాహనచోదకులు తగు జాగ్రత్తలు పాటించాలని సూచించారు.

హెల్మెట్‌ తప్పనిసరి

జియ్యమ్మవలస: ద్విచక్ర వాహనదారులు తప్పనిసరిగా హెల్మెట్‌ ధరించాలని ఎస్‌ఐ ప్రసన్నకుమార్‌ సూచించారు. మండలంలోని బీజేపురం వద్ద సిబ్బందితో కలిసి ఆయన ఆదివారం వాహన తనిఖీలు చేపట్టారు. అటువైపుగా వచ్చే వాహనదారుల లైసెన్స్‌తో పాటు వాహన ధ్రువపత్రాలను పరిశీలించి, పలు సూచనలు చేశారు. వాహనాలతో రోడ్లపైకి వచ్చేటప్పుడు వాహన సంబంధిత ధ్రువపత్రాలు వెంట తీసుకురావాలన్నారు. అలాగే ప్రతిఒక్కరూ రోడ్డు భద్రతా నియమాలు పాటించాలన్నారు. మద్యం తాగి వాహనాలు నడపవద్దని, మైనర్లకు వాహనాలు ఇవ్వవద్దని, కారు నడిపేవారు సీటు బెల్టు పెట్టుకోవాలని తెలిపారు.

గుమ్మలక్ష్మీపురం(కురుపాం): మండలంలోని ములిగూడ మూడురోడ్ల జంక్షన్‌ వద్ద పోలీసులు వాహన తనిఖీలు చేపట్టారు. కురుపాం ఎస్‌ఐ పి.నారాయణరావు తన సిబ్బందితో కలిసి అటువైపుగా వచ్చే వాహనదారులను ఆపి, వారి వాహన ధ్రువపత్రాలు, లైసెన్స్‌లను పరిశీలించి, పలు సూచనలు చేశారు. ప్రతిఒక్కరూ ట్రాఫిక్‌ నిబంధనలు పాటించి, రోడ్డు ప్రమాదాల నివారణకు కృషి చేయాలని కోరారు. ద్విచక్ర వాహనదారులు హెల్మెట్‌, కారు నడిపేవారు సీటుబెల్టు పెట్టుకోవాలని తెలిపారు.

గరుగుబిల్లి: మండలంలోని గొట్టివలస ఆర్‌అండ్‌బీ రోడ్డు సమీపంలో వాహనదారులకు ట్రాఫిక్‌ నిబంధనలపై ఆదివారం అవగాహన కల్పించారు. ఎస్‌ఐ పి.రమేష్‌నాయుడు వాహనదారులకు పలు సూచనలు చేశారు. వాహనాలతో బయటకు వచ్చేటప్పుడు వాహన ధ్రువపత్రాలన్నింటినీ వెంట తీసుకురావాలన్నారు. మైనర్లకు వాహనాలు ఇవ్వవద్దని, మద్యం తాగి, సెల్‌ఫోన్‌ మాట్లాడుతూ వాహనాలు నడపవద్దన్నారు. అలాగే ద్విచక్ర వాహనదారులు హెల్మెట్‌ ధరించాలని, కారు డ్రైవర్లు తప్పనిసరిగా సీటుబెల్టు ధరించాలని తెలిపారు.


పాలకొండ రూరల్‌: వాహన తనిఖీలు చేపడుతున్న ఎస్సై ప్రయోగమూర్తి


జియ్యమ్మవలస: వాహనదారులతో మాట్లాడుతున్న ఎస్‌ఐ ప్రసన్నకుమార్‌


గుమ్మలక్ష్మీపురం(కురుపాం): అవగాహన కల్పిస్తున్న ఎస్‌ఐ నారాయణరావు


గరుగుబిల్లి: హెల్మెట్‌ ధారణపై అవగాహన కల్పిస్తున్న ఎస్‌ఐ రమేష్‌నాయుడు

అవగాహన..


సీతంపేట మండలంలోని కుశిమి జంక్షన్‌ వద్ద ఎస్సై అమ్మన్నరావు హెల్మెట్‌ వినియోగంపై ఆదివారం అవగాహన కల్పిచారు. వాహనదారులు కచ్చితంగా నిబంధనలు పాటించాలని సూచించారు. మద్యం మత్తులో ఎట్టి పరిస్థితుల్లో వాహనాలు నడపరాదన్నారు. – సీతంపేట

రాళ్లు తేలిన రహదారి


సీతంపేట మండలంలోని కోడిశ సెంటర్‌ నుంచి గుడ్డిమీదగూడకు వెళ్లే రహదారి పూర్తిగా రాళ్లు తేలి అధ్వానంగా మారింది. దీంతో వాహనచోదకులు రాకపోకలకు ఇబ్బంది పడుతున్నారు. అత్యవసర సమయంలో గ్రామం నుంచి మైదాన ప్రాంతానికి వెళ్లడానికి నరకం చూడాల్సి వస్తోందని గ్రామస్తులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. అధికారులు స్పందించి మరమ్మతులు చేపట్టాలని కోరుతున్నారు. – సీతంపేట

పార్కులో పర్యాటకుల సందడి


గరుగుబిల్లి మండలం, తోటపల్లి రిజర్వాయరు కుడి మట్టికట్ట పరిసరాల్లోని ఐటీడీఏ పార్కులో పర్యాటకులు సందడి చేశారు. ఆదివారం సెలవుదినం కావడంతో అందరూ పిల్లాపాపలతో వచ్చి, పార్కు అందాలను ఆస్వాదించారు. ముఖ్యంగా చిన్నారులు అక్కడి జారుడుబల్ల, ఊయల, జంప్‌ బాల్స్‌ ఆటలు ఆడి, ఆనందించారు. ఇదిలా ఉండగా, పార్కులో ఏర్పాటు చేసి ఆదివాసీ సంప్రదాయ వస్త్రధారణలోని మహిళలు, పురుషులు, పిల్లల విగ్రహాలు ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి. –గరుగుబిల్లి

విద్యుత్‌ బిల్లులు చెల్లించలేం..


పాలకొండ రూరల్‌: మల్లమ్మగూడలో సీపీఎం నేతృత్వంలో గిరిజనుల ఆందోళన

పాలకొండ రూరల్‌: కూటమి ప్రభుత్వంలో పెరిగిన విద్యుత్‌ బిల్లులను చెల్లించలేమని మండలంలోని సింగన్నవలస పంచాయతీ మల్లమ్మగూడ గిరిజనులు ఆవేదన వ్యక్తం చేశారు. సీపీఎం రాష్ట్ర కమిటీ పిలుపు మేరకు స్థానిక సీపీఎం నాయకులు గిరిజనులతో కలిసి ఆదివారం నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా సంఘ సభ్యుడు ఎ.భానుచందర్‌ మాట్లాడుతూ.. నాడు ఎన్నికల ముందు విద్యుత్‌ చార్జీలు పెంచమని చెప్పిన ఆరు నెలలకే చార్జీల మోత మోగించారన్నారు. ట్రూఅప్‌ చార్జీల పేరిట, ఇతర చార్జీల పేరిట బడుగులపై భారం మోపడం అన్యాయమని చెప్పారు. తక్షణమే విద్యుత్‌ చార్జీలు తగ్గించాలని లేకుంటే ప్రజా పోరాటం తప్పదన్నారు. కార్యక్రమంలో చెంప, సాంబయ్య, చిన్నారువు, మజ్జియ్య, సింహాచలం, రమేష్‌ తదితరులున్నారు.


భామిని: బాలేరులో విద్యుత్‌ బిల్లులు దహనం చేస్తున్న వైఎస్సార్‌సీపీ నాయకులు

భారం మోపడం తగదు..

భామిని: ప్రజలపై విద్యుత్తు భారం మోపడం తగదని వైఎస్సార్‌సీపీ నాయకులు ఆరోపించారు. ఈ మేరకు మండలంలోని బాలేరులో నిరసన వ్యక్తం చేస్తూ, విద్యుత్‌ బిల్లులను దహనం చేశారు. ఈ సందర్భంగా పలువురు మాట్లాడుతూ, ఎన్నికల ముందు విద్యుత్‌ చార్జీలు పెంచబోమని చెప్పి.. ఇప్పుడు పెంచడమేమిటని ప్రశ్నించారు. వెంటనే కూటమి ప్రభుత్వం స్పందించి పెంచిన విద్యుత్‌ చార్జీలను తగ్గించాలని కోరారు. కార్యక్రమంలో నాయకులు కొత్తకోట చంద్రశేఖర్‌, జామి ప్రభాకర్‌, మేడిబోయిన చలపతి, దామోదర కంతయ్య, బోడాల చిన్నయ్యదొర, కొత్తకోట ఆంజనేయులు, మడపాన కృష్ణ, తదితరులు పాల్గొన్నారు.

అమరజీవి త్యాగాలు మరువలేనివి


సీతంపేట: అమరజీవి చిత్రపటానికి పూలమాలలు వేస్తున్న డిప్యూటీ ఈఓ నారాయుడు

గరుగుబిల్లి: అమరజీవి పొట్టి శ్రీరాములు త్యాగాలు మరువలేనివని లైబ్రేరియన్‌ ఎస్‌.మధుసూదనరావు కొనియాడారు. స్థానిక శాఖా గ్రంథాలయంలో పొట్టి శ్రీరాములు వర్ధంతి ఆదివారం నిర్వహించారు. కార్యక్రమానికి హాజరైన పాఠకులతో కలిసి ఆయన శ్రీరాములు చిత్రపటానికి పూలమాలలు వేసి, నివాళులర్పించారు. అనంతరం ఆంధ్ర రాష్ట్ర అవతరణకు ఆయన చేసిన కృషిని వివరించారు. ప్రత్యేక రాష్ట్ర ఏర్పాటు కోసం ప్రాణత్యాగం చేసిన అతికొద్ది మందిలో శ్రీరాములు ప్రథమ వరుసలో ఉంటారని, ఆయన ఆశయ సాధనకు అందరూ కృషి చేయాలని కోరారు.

సీతంపేట: సీతంపేట ఐటీడీఏలోని ఎస్‌ఆర్‌ శంకరన్‌ సమావేశ మందిరంలో అమరజీవి పొట్టి శ్రీరాములు వర్ధంతి కార్యక్రమం ఆదివారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన చిత్రపటానికి అధికారులు పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో డిప్యూటీఈఓ పి.నారాయుడు, ఏఎంఓ కోటిబాబు, సత్యారావు, రాజారావు పాల్గొన్నారు.


గరుగుబిల్లి: పొట్టి శ్రీరాములు చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న లైబ్రేరియన్‌, విద్యార్థులు

ప్రజల భాగస్వామ్యంతో
రహదారి ప్రమాదాల నివారణ

- పోలీస్‌ యంత్రాంగం కృషి
- పార్వతీపురంలో నిత్యం జాగ్రత్తలు సూచిస్తున్న సిబ్బంది
- యువతకు కౌన్సిలింగ్‌
- నిదానమే ప్రధానమంటూ ప్రచారం
- హెల్మెట్‌ ధరించాలని వినతి


పార్వతీపురం పట్టణంలో అవగాహన కల్పిస్తున్న పోలీసు సిబ్బంది

పార్వతీపురంటౌన్‌: రహదారి ప్రమాదాల నివారణకు పార్వతీపురం పోలీస్‌ అధికారులు ప్రత్యేక చర్యలు చేపడుతున్నారు. నియోజకవర్గంలో పార్వతీపురం టౌన్‌, రూరల్‌, సీతానగరం, బలిజిపేట ప్రాంతాల్లో అధిక సంఖ్యలో భారీ వాహనాలు రాకపోకలు సాగిస్తుంటాయి. వాహనాలు అతి వేగంగా రావడంతో తరచూ ప్రమాదాలు జరుగుతున్నాయి. దీంతో జిల్లా ఎస్పీ ఎస్‌వీ మాధవ్‌ రెడ్డి ఆదేశాలతో ప్రధాన రహదారుల్లో పెట్రోలింగ్‌ ముమ్మరం చేశారు. ప్రజల భాగస్వామ్యంతో రహదారి ప్రమాదాల నివారణకు కృషి చేయవచ్చని పోలీసు యంత్రాగం చెబుతోంది.

మైనర్స్‌ డ్రైవింగ్‌పై ప్రత్యేక దృష్టి

నియోజకవర్గంలో ప్రతిరోజూ సాయంత్రం వాహనాలు తనిఖీ చేస్తున్నారు. మైనర్లకు తల్లిదండ్రులు వాహనాలు ఇవ్వడం వల్ల ప్రమాదాలు జరిగే అవకాశాలు ఎక్కువగా ఉన్నాయి. మైనర్లు కొత్తగా వాహనాలు నడుపుతూ పరిమితికి మించి వేగంగా డ్రైవ్‌ చేస్తున్నారు. అటువంటి సమయంలో రోడ్డు ప్రమాదాలు జరిగి మృత్యువాత పడే అవకాశాలు ఉన్నాయి. ప్రభుత్వ నిబంధనల మేరకు 18 సంవత్సరాలు పైబడి, డ్రైవింగ్‌ లైసెన్స్‌ ఉన్న వ్యక్తులు మాత్రమే వాహనాలు నడపాలని సూచిస్తున్నారు. మొదటిసారి వాహనం నడుపుతూ పట్టుబడితే జరిమానా, రెండోసారి పట్టుబడితే జరిమానాతో పాటు వాహనం సీజ్‌ చేసి కోర్టులో హాజరుపరుస్తున్నారు. వాహనదారుడు మద్యం తాగినట్లు కోర్టులో రుజువైతే రూ.12 వేలు జరిమానా, జైలుశిక్ష విధిస్తున్నారు. నిబంధనలు పాటించని వాహన చోదకులు, రిజిస్ట్రేషన్‌ సర్టిఫికెట్‌, డ్రైవింగ్‌ లైసెన్స్‌, పొల్యూషన్‌ సర్టిఫికెట్‌, ఇన్సూరెన్స్‌ సర్టిఫికెట్‌ లేని వారిపై కేసులు నమోదు చేస్తున్నారు.

ఆటో డ్రైవర్లకు అవగాహన

ఆటోల్లో మితిమీరిన ప్రయాణికులను ఎక్కించినా, మాదకద్రవ్యాలు, మత్తు పదార్థాలు తరలించినా నేరమని ఆటో డ్రైవర్లకు అవగాహన కల్పిస్తున్నారు. మద్యం తాగి వాహనాలు నడిపేవారిపై జరిమానాతో పాటు కేసులు నమోదు చేస్తున్నారు. జాతీయ రహదారుల వెంబడి ఉన్న దాబాల వద్ద వాహనాలు నిలిచిపోకుండా ట్రాఫిక్‌ను ఎప్పటికప్పుడు క్లియర్‌ చేస్తున్నారు.

హెల్మెట్‌ ధరిస్తే ప్రాణాపాయం ఉండదు

రోడ్డు ప్రమాదాల నివారణలో భాగంగా ప్రధాన రహదారుల్లో నిత్యం వాహన దారులకు అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తున్నాం. ముఖ్యంగా మీరు బాగుంటేనే మీ కుటుంబం బాగుంటుందనే నినాదాన్ని ప్రజల్లోకి తీసుకువెళ్తున్నాం. వివిధ రోడ్డు ప్రమాదాల్లో కుటుంబాన్ని పోషించే పెద్ద చనిపోతే ఆ కుటుంబం రోడ్డున పడే పరిస్థితి తలెత్తుతోంది. అందుకని మీపై ఆధారపడ్డ వారి కోసమైనా మీరు హెల్మెట్‌ ధరించాలని, నిదానంగా ప్రయాణించాలని కోరుతున్నాం.

– ఎం. గోవింద్‌, ఎస్సై, పార్వతీపురం టౌన్‌

చెరకు తూనిక యంత్రం ప్రారంభం

సీతానగరం: సంకిలిలోని ఈఐడీప్యారీస్‌ సుగర్‌ ఫ్యాక్టరీ యాజమాన్యం సమకూర్చిన చెరకు తూనిక యంత్రాన్ని చెరకు అభివృద్ధి శాఖ డీజీఎం(కేన్‌)మురళి ఆధ్వర్యంలో సిబ్బంది ఆదివారం సీతానగరం మండలంలో ప్రారంభించారు. ఇప్పటికే బూర్జ, వెంకటాపురం, ఏగోటివలస గ్రామాల్లో చెరకు తూనిక యంత్రాలు పని చేస్తున్నాయి.కృష్ణారాయపురం గ్రామ చెరకు రైతుల కోరిక మేరకు నూతనంగా చెరకు తూనిక యంత్రాన్ని ఏర్పాటు చేశారు. ఈ మేరకు రైతు నాయకులు జి.సింహాచలం, జి.వెంకటరమణ మాట్లాడుతూ పెదంకలాం, కృష్ణారాయపురం గ్రామాల్లో చెరకు సాగు విస్తీర్ణం పెరుగుతున్న కారణంగా తూనికయంత్రాన్ని యాజమాన్యం నెలకొల్పడం అభినందనీయమన్నారు. చెరకు తూనిక యంత్రం ఏర్పాటుతో ఈఐడీప్యారీస్‌ (సంకిలి సుగర్‌ ప్యాక్టరీ) నుంచి లారీలు కేటాయించడం వల్ల చెరకు లోడ్‌ చేయడం ప్రారంభించామన్నారు.

విగ్రహాల ఏర్పాటుకు రూ.30వేల విరాళం

బలిజిపేట: మండలంలోని పెదపెంకి గ్రామంలో పునర్నిర్మాణం జరుగుతున్న గీతా మందిరంలో కృష్ణార్జునుల విగ్రహాల ఏర్పాటుకు గ్రామానికి చెందిన కెంగువ సూరమ్మ రూ.30,000వేలు విరాళంగా అందించారు. గీతామందిర నిర్మాణకర్త గంట సాధుకు ఈ విరాళాన్ని ఆదివారం అందజేసి మందిరాన్ని అభివృద్ధి చేయాలని, అందరికీ భక్తి మార్గాన్ని సూచించాలని ఆమె అన్నారు.